క్లుప్తంగా

'కొండమూరి' వైద్య సేవలు మరువలేనివి



అంగరలో కొండమూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన సీనియర్ ప్రైవేటు వైద్యులు డాక్టర్ కొండమూరి నరసింహమూర్తి వైద్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. కొండమూరిని ప్రైవేటు వైద్యులు ఆరాధ్యదైవంగా కొలుస్తారు. ఆయన వద్ద వైద్యం నేర్చుకున్న వారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు వైద్యులుగా సేవలందిస్తున్నారు. ఆయనపై ఉన్న అభిమానంతో అంగరలో నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని శుక్రవారం కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ మరకా రాంబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగుమళ్ల రాంబాబు, డాక్టర్ రఘువీర్ కాంత్, డాక్టర్ సత్య నిశాంత్, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, నాయకులు బళ్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఐగా వెంకట నారాయణ



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట నారాయణ

రామచంద్రపురం: స్థానిక సీఐగా ఎం.వెంకట నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన కె.అశోక్ వీఆర్‌లోకి వెళ్లారు. ప్రస్తుతం కాకినాడలో వీఆర్‌లో ఉన్న వెంకటనారాయణ రామచంద్రపురం సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

నేడు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ సమావేశం

రామచంద్రపురం: జిల్లా ఉపాధ్యాయ సంఘ సమావేశాన్ని స్థానిక రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవనంలో నేడు (శనివారం) ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి శాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవీ సత్యనారాయణ ఇతర జిల్లా రాష్ట్ర నాయకులు విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులందరూ ఈ సమావేశంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాజులూరు తహసీల్దార్‌గా ఠాగూర్



కాజులూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జీఆర్ ఠాగూర్

కాజులూరు: మండల తహసీల్దార్‌గా జీఆర్ ఠాగూర్ నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎల్.శివకుమార్ పోలవరం ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లిపోయారు. దీంతో కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జీఆర్ ఠాగూర్ ఇక్కడకు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆర్ఐ వేగేశ్వరరావు, డీటీ శ్రీనివాస్, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు, కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జీఆర్ ఠాగూర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

వీఆర్వోలకు ప్రమోషన్లు కల్పించాలి

రామచంద్రపురం రూరల్: అన్ని అర్హతలు ఉన్న గ్రేడ్–1 గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియారిటీ ప్రకారం సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించాలని మండల వీఆర్వోలు శుక్రవారం తహసీల్దార్ ఎం.సావిత్రికి వినతి పత్రం అందజేశారు. వీఆర్వోల సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దాల బాపూజీ, మండల అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి మాట్లాడుతూ జీఓ నెం.166 ప్రకారం గ్రేడ్–2 వీర్వోఓలకు గ్రేడ్–1, ప్రమోషన్ కల్పించాలని, గ్రేడ్–1, గ్రేడ్–2 వీర్వోఓలకు కామన్ డీడీఓగా తహసీల్దార్ ఉండాలని, అందరు వీఆర్వోలకు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ఏపీఎఫ్ఆర్ఎస్ ద్వారా అమలు చేయాలని, వీఆర్వోలకు కంప్యూటర్ సదుపాయం కల్పించాలని, మహిళా వీఆర్వోలకు నిర్ణీత పని వేళలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పని వత్తిడి ఎక్కువగా ఉండటం వలన వీఆర్వోలు గుండె పోట్లు, ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర డిపార్ట్‌మెంట్ల పనులను వీఆర్వోలకు కేటాయించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల కార్యదర్శి కె.సురేష్, జాయింట్ సెక్రటరీ జుత్తుక మాధవస్వామి, ఉపాధ్యక్షుడు కాకినాడ సత్యవతి, దంగేటి నరేష్, కోశాధికారి కె.పరంజ్యోతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముక్కోటి వందనాలు

- వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు

రాయవరం: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి వేడుకలు మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో శుక్రవారం కన్నులపండువగా జరిగాయి. వైష్ణవ ఆలయాలు హరినామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గోపాలుడిగా, జనార్దనుడిగా, వేంకటేశ్వరస్వామిగా పూజలందుకుంటున్న శ్రీహరికి పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్థానిక భూమంచిరెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని పలు రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో ఏకావహం నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వి.సావరం శెట్టిబలిజ రామాలయం వద్ద 69వ వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఏకాహం ఏర్పాటు చేశారు. వి.సావరం, పరిసర గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని రాయవరం,



రాయవరంలో విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో వైకుంఠ ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

రామచంద్రపురం రూరల్: మండలంలోని రూరల్ గ్రామాల్లోను, రామచంద్రపురం పట్టణంలోను దేవాలయాలు ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన లక్ష్మీనారాయణస్వామి దేవాలయం, ఆలయ ప్రాంగణంలోని సత్యనారాయణ స్వామి దేవాలయం, ద్రాక్షారామలో వేంకటేశ్వరస్వామివారి ఆలయం, భీమక్రోసుపాలెంలో కోదండ రామాలయం, వెలంపాలెంలో లక్ష్మీనారాయణస్వామి ఆలయం, తోటపేట రామాలయం, ఆదివారపుపేటలో శివబాలయోగి మహరాజ్ ఆశ్రమం, కందులపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం తదితర దేవాలయాల్లో భక్తులు ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు క్యూ కట్టారు. ఆయా దేవాలయాల్లో ఏకాహాలు, భజనలు, దీపోత్సవాలు నిర్వహించారు.

కాజులూరులో..

కాజులూరు: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో భక్తులు పూజలు ఘనంగా నిర్వహించారు. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి, లేదా ముక్కోటి ఏకాదశి అని అంటారు. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకుని ఉంటాయని వైష్ణవాలయాల్లోని ఉత్తర ద్వారం వద్ద భక్తులు తెల్లవారుజామునే వేచి ఉంటారు. ముక్కోటి ఏకాదశి నాడే హలాహలం, అమృతం పుట్టిందంటారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని కాజులూరు, గొల్లపాలెం, అయితపూడి, శీల, కోలంక గ్రామాలలోని వేంకటేశ్వస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనాలు చేసుకున్నారు. గొల్లపాలెం వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు పెద్దింటి కృష్ణమోహనాచార్యులు స్వామివారికి చామంతి పూలతో సహస్రనామార్చన నిర్వహించి గోదాదేవికి ప్రీతికరమైన కుడలై ప్రసాదం నివేదన చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.



గొల్లపాలెం వేంకటేశ్వస్వామి ఆలయంలో ఉత్తరద్వారం గుండా వెళుతున్న భక్తులు



కందులపాలెం వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



మండపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన భక్తి సంగీత కచేరి

మండపేట: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండపేట అర్బన్, రూరల్ పరిధిలోని వైష్ణవ ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పండితులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు. మండపేట కలువ పువ్వు సెంటర్లో వేంచేసిన వేంకటేశ్వరస్వామి, రథంగుడి సెంటర్‌లో వేంచేసిన జనార్దన స్వామి వార్లను వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈఓ కామేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పోతంశెట్టి సత్తిబాబు సత్యనారాయణ (సత్తిబాబు) ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఐఎస్ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇనపకోళ్ల సత్యనారాయణ సౌజన్యంతో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, భక్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ నేత రెడ్డి రాధాకృష్ణ, పలువురు పట్టణ ప్రముఖులు స్వామివారి దర్శించుకున్నారు. టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి నేతృత్వంలో ఏఎస్ఐ చిన్నారావు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కలువపువ్వు సెంటర్లో బారికేడ్లు ఏర్పాటు చేసి కేపీ రోడ్డు ట్రాఫిక్‌ను దారి మళ్లించారు.



మండపేటలో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

చెక్క పడి బాలుడికి గాయం

పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్ల ద్వారా దర్శనానికి వెళ్లిన ఆరేళ్ల బాలుడికి గాయమైంది. బాలుడు క్యూలైన్లలో నడిచి వెళ్తుండగా ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి అక్కడ ఉన్న చెక్క ఒకటి బాలుడి చిటికెన వేలిపై పడి గాయమైంది. వేలి నుంచి తీవ్ర రక్తస్రావం జరిగి బాలుడు విలవిల్లాడిపోయాడు. కనీసం అక్కడ ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కూడా ఏర్పాటు చేయక పోవడంతో గాయానికి కట్టు కట్టే అవకాశం లేకుండా పోయింది. తోటి భక్తులు గమనించి రుమాలు తడిపి కట్టుకట్టి స్థానిక ఆసుపత్రికి తరలించారు. కాగా సాధారణ భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారానే వృద్ధులను సైతం దర్శనానికి పంపడంతో తీవ్ర అవస్థలు పడ్డారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

- ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు
- పాఠశాలల్లో పండగ సందడి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర సిద్ధార్థ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. విద్యార్థినులు నైపుణ్యంతో వినూత్నమైన ముగ్గులను అద్దారు. పల్లె అందాలు, పాడి ప్రాధాన్యం, వృత్తుల విశేషాలను వారి ముగ్గుల్లో ప్రతిబింబించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డూడూ బసవన్న వేషధారణలు ఆకట్టుకున్నాయి. భోగిమంట వేసి భోగి పళ్లు, గొబ్బెమ్మలు, దేవతామూర్తులను తలుస్తూ సంప్రదాయ నృత్యం చేశారు.

మండపేట: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక రావులపేట వీధిలోని విద్యావికాస్, స్వర్ణభారతి విద్యాసంస్థలు, మెయిన్ రోడ్డు లూథరన్ చర్చి వీధిలోని సెంటెన్స్, మారేడుబాకలోని మండపేట పబ్లిక్ స్కూల్ అండ్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు కన్నులపండువగా జరిగాయి. ఆయా సంస్థల నిర్వాహకులు వర్రే సత్యనారాయణ, వల్లూరి చిన్నారావు, సెంటెన్స్ హెచ్ఎంల పర్యవేక్షణలో వేడుకలు కనువిందుగా సాగాయి. విద్యార్థుల సంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరయ్యారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగి మంటలు వెలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన భరత నాట్యం, నృత్యాలు, హరిదాసు, గంగిరెద్దుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు గాలిపటాలు ఎగుర వేసి సందడి చేశారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంట వేసి చుట్టూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన నెలపర్తిపాడు నరాల రాజేశ్వరి, హసన్‌బాద ఏఎన్ఎం వెంకటరమణి, ఉందూరు ఏఎన్ఎం దుర్గాభవానిలకు పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు. సూర్య హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో సందడి చేశారు. బొమ్మల కొలువు, ప్రభల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముగ్గుల పోటీలు, నృత్య పోటీలు నిర్వహించారు. భోగి మంట చుట్టూ వందలాది మంది విద్యార్థినులు నృత్యాలు చేస్తూ సందడి చేయడంతో తిరునాళ్లను తలపించింది.



మండపేట స్వర్ణభారతి స్కూల్‌లో భోగి మంట వద్ద సందడి చేస్తున్న విద్యార్థులు



అంగరలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



ద్రాక్షారామ సూర్య హైస్కూల్ వద్ద భోగి మంటల చుట్టూ నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

రాయవరం: మండలంలోని చెల్లూరు సర్వారాయ సుగర్స్ ఆవరణలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రాజమహేంద్రవరం బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ ఎస్ఆర్ ఠాగూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు పరిధిలోని డ్వాక్రా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాచవరం, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాలకు చెందిన 100 మంది మహిళలు పాల్గొన్నారు. వెంటూరు గ్రామానికి చెందిన శీలం రేణుకదేవి, చెల్లూరుకు చెందిన పి.బాలసరస్వతి, అదే గ్రామానికి చెందిన వి.నాగలక్ష్మి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. విజేతలకు సర్వారాయ షుగర్స్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ జి.కోటేశ్వరరావు, బీవోబీ హైదరాబాద్ శాఖ చీఫ్ మేనేజర్ వెంకన్న చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు తూర్పుగోదావరి జిల్లా యానిమేటర్ల సంఘం అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి, బ్యాంకు ఆఫ్ బరోడా చెల్లూరు శాఖ సిబ్బంది, యానిమేటర్లు పాల్గొన్నారు.

మిగులు బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.35.67 లక్షల మిగులు బడ్జెట్

రామచంద్రపురం: రాబోయే ఆర్థిక సంవత్సరానికి రామచంద్రపురం మున్సిపాలిటీకి రూ.35,67, 793ల మిగులు బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. స్థానిక కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం కౌన్సిల్ బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాబోయే 2025–26 సంవత్సరానికి మున్సిపాలిటీలో అంచనాలతో కూడి బడ్జెట్‌ను కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చారు. గత ఏడాది ప్రారంభ నిల్వ రూ.18,44,65,294 పేర్కొనగా ముగింపు నిల్వగా రూ.3,95,27005గా చూపించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను, రాబడి ఆదాయంఅ రూ.11,99,22,372, రాబడి ఖర్చు రూ.9,03,50,000, మిగులు రాబడి ఆదాయం రూ.2,95,72,372, మూలధన నిధులకు మళ్లింపు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మూలధన ఆదాయం కింద రూ.14,17,00,000, మూలధన ఖర్చుల నిమిత్తం రూ.20,36,00,000 చూపుతూ ముగింపు నిల్వ రూ.71,99,377లుగా కాగా అందులో నుంచి వివిధ స్కీంల ద్వారా గ్రాంటు నిధులు రూ.36,31,584 మినహాయించగా వనరుల ముగింపు నిల్వగా రూ.35,67,793 మిగులు బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చైర్‌పర్సన్ శ్రీదేవి ప్రకటించారు. మున్సిపాలిటీలోని వివిధ అభివృద్ధి పనులకు గాను కేటాయింపులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నీటి సరఫరాకు 13.71 శాతం రూ.85,00,000, కాలువలకు 15.48 శాతం రూ.96,00,000, రోడ్లకు 17.74 శాతం రూ.1,10,00,000, వీధి దీపాలకు 5.65 శాతం 35,00,000, పార్కులు వినోదాలకు 6.45 శాతం 40,00,000, మార్కెట్లు పార్కుల భవనాలకు 16.13 శాతం 1,00,00,000 కలిసి మొత్తంగా రూ.4,66,00,000 వచ్చే ఏడాది వార్షిక బడ్జెట్‌లో కేటాయించారు. దీనికి కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు బడ్జెట్‌లో కేటాయించిన నిధులపై కౌన్సిల్‌కు వివరించారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ శ్రీదేవి, కమిషనర్ నాయుడు

మాజీ ఎమ్మెల్యే అప్పారావుకు ఘన నివాళి



పామర్రులో పిల్లి అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పిల్లి సూర్యప్రకాష్, వాసంశెట్టి శ్యాం తదితరులు



వెంకటాయపాలెంలో పిల్లి అప్పారావు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న పిల్లి సూర్యప్రకాశ్, నాయకులు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అప్పారావు అభిమానులు మంగళవారం ఘనంగా నివాళి అర్పించారు. ఆయన స్వగ్రామం వెంకటాయపాలెంలోను, ద్రాక్షారామలోను ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్, పిల్లి అప్పారావు మనవడు వాసంశెట్టి శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు నియోజకవర్గంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పిల్లి అప్పారావు తనయుడు పిల్లి శ్రీనివాస రామారావు, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, మాజీ ఎంపీటీసీ దడాల రవికుమార్, సంఘ పెద్దలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లోనూ అప్పారావుకు శెట్టిబలిజలు నివాళులర్పించారు.

పిల్లి అప్పారావు సేవల ఆదర్శనీయం

కె.గంగవరం: మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని పామర్రులో మంగళవారం అప్పారావు 38వ వర్ధంతి వేడుకలను ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానికంగా ఉన్న అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, మాజీ స్టేట్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, ఎంపీపీ పంపన నాగమణి, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, నాయకులు సాదే కపిల్, బత్తుల అప్పారావు, కుడుపూడి శ్రీనివాస్, సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ సూరిబాబు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

12న మెగా ముగ్గుల పోటీలు

రామచంద్రపురం: జనవరి 12న వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవ్ 2కె25 పేరుతో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొని విలువైన బహుమతులు గెలుచుకోవాలని మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సంక్రాంతి సంబరాలు మరింత ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల12న ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ముగ్గుల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా వాషింగ్ మెషీన్, రెండో బహుమతిగా రిఫ్రిజిరేటర్ (ఫ్రిడ్జ్), మూడో బహుమతిగా ఫ్లాట్ ఎల్ఈడీ కలర్ టీవీ అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన మహిళలు ఈ పోటీల్లో పాల్గొని మూడు రోజుల పాటు జరిగే మల్టిపుల్ ఈవెంట్లను విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 80965 23666 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. అలాగే 13న ఉదయం 7 గంటలకు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, కోలాటం, మధ్యాహ్నం 3 గంటలకు ఫ్లాష్ మాబ్, మ్యాజిక్ షో, సాయంత్రం 6:30 గంటలకు డ్యాన్స్, పాటల పోటీలు, 14న సాయంత్రం 6:30 నుంచి జబర్దస్త్ కామెడీషో, ఢీ టైటిల్ విన్నర్స్ జానుతో డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొని సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు నూతన వస్త్రాల అందజేత



అనాథ దివ్యాంగ బాలలకు నూతన వస్త్రాలను అందించిన మంత్రి సుభాష్



ద్రాక్షారామలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసిన పాలకవర్గం

రామచంద్రపురం: పట్టణంలోని ముచ్చుమిల్లి రోడ్డులో ఉన్న జోయ్ మినిస్ట్రీస్ బెతెస్త న్యూలైఫ్ సెంటర్‌లో ఆశ్రయం పొందుతున్న మానసిక దివ్యాంగులు. వారిని బాహ్య ప్రపంచంలోకి తీసుకొచ్చి పిల్లలతో ఆనందంగా గడిపారు మంత్రి వాసంశెట్టి సుభాష్. వినూత్నంగా ఆలోచించి వారిని రిలయన్స్ ట్రెండ్స్ షాపింగ్‌మాల్‌కి తీసుకొచ్చారు. పిల్లలతో మంత్రి సుభాష్ మీకు నచ్చిన వస్త్రాలు ఎంపిక చేసుకుని తీసుకోండని చెప్పడంతో ఆ 65 మంది ఆనందంతో పొంగిపోయాయి. వారందరికీ నూతన వస్త్రాలకు కొనిచ్చారు డిగ్రీ పూర్తి చేసుకున్న దివ్యాంగురాలు ఖండవల్లి దుర్గాదేవికి కాకినాడలోని వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో మాట్లాడి అక్కడికక్కడే ఉద్యోగం ఏర్పాటు చేశారు. అలాగే దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలను నిర్వహిస్తున్న అలెగ్జాండర్, ప్రిస్కిల్లా దంపతులను మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు.

పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ అయిన ద్రాక్షారామలో 31 మంది పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి శుక్రవారం సర్పంచ్ కొత్తపల్లి అరుణ చేతుల మీదుగా నూతన వస్త్రాలు, సబ్బులు, నూనె, గ్లౌజ్‌లు, షూలు తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సాక్షి పద్మనాభం, యండమూరి ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలు, గుండాట జరగకుండా పర్యవేక్షణ కమిటీలు

రామచంద్రపురం రూరల్: సంక్రాంతి పురస్కరించుకుని హైకోర్టు ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోడి పందాలు, గుండాటలు, పేకాటలు నిర్వహించకుండా గ్రామ స్థాయి, మండల స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు రామచంద్రపురం మండల తహసీల్దార్ ఎం.సావిత్రి శుక్రవారం విలేకరులకు తెలిపారు. గ్రామ స్థాయి కమిటీలో గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, గ్రామ సచివాలయ సిబ్బంది ఉంటారని, అదే విధంగా మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, పశు సంవర్ధక శాఖ అధికారి, ద్రాక్షారామ, రామచంద్రపురం పోలీస్ స్టేషన్ల ఎస్సైలు ఉంటారన్నారు. కోళ్ల కాళ్లకు పదునైన కత్తులు, బ్లేడులు అమర్చడం, కోళ్లను కట్టి ఉంచడం, గాయపడిన కోళ్లను ఒకదానిపై ఒకటి గాలిలో విసరడంపై నిషేధం ఉందని తెలిపారు.

GENERAL PUBLICATION

UNDER THE INSTRUCTIONS FROM OUR CLIENT M/S. SHRIRAM FINANCE LIMITED., REGD OFFICE AT CHENNAI AND BRANCH OFFICE AT MANDAPETA, WE ISSUE THIS NOTICE TO THE GENERAL PUBLIC.

OUR CLIENT IS INTEND TO ADVANCE LOAN TO KONDETI ANANTHALAKSHMI WIFE OF VENKATA RAO, RESIDENT OF ALAMURU, ALAMURU MANDAL, EAST GODAVARI DIST. Who agreed to create equitable mortgage relating to the under mentioned schedule properties exclusively belongs to them. The public is here by informed that if anybody has got any objection in respect of the Mortgage of the schedule properties. Kindly contact under mentioned address with in one week. Otherwise same is treated as no objection.

: Schedule :

EAST GODAVARI DT. ALAMURU SRO. ALAMURU MANDAL, ALAMURU VILLAGE WITH IN THE ALAMURU GRAMA PANCHAYATH AREA.

All the part and parcel of the Site & Tiled House the door no.8-5, for an extent of 118 sq yards, situated ALAMURU VILLAGE WITH IN THE ALAMURU GRAMA PANCHAYATH AREA in Grama kantam R.S.No. 207/2C bounded as follows:-

1 Item for an extent of 96.52sq yards = 80.7 sq metres bounded by:

East : 20-03 feet site of Takasi Tatarao; South: 41-09 Feet 2nd item of this schedule for same extent and joint lane for some extent; West: 20-09 feet joint lane for some extent and house of Guthikonda Radhakrishna for some extent; North: 43-00 Feet - house of Guthikonda Radhakrishna for some extent and site of undi krishnaveeramma for some extentWith in the above boundaries for an extent of 96.52sq yards 80.7 sq metres site and tiled house

2nd Item for an extent of 21.58 sq yards = 18.00 sq mtrs bounded by:

East: 06-09 feet - site of Takasi Tatarao, South: 28.09 Feet - Houses belongs to vendors., West: 06-09 feet - Joint Lane., North 28.09 Feet - house in 1 item. With in the above boundaries for an extent of 21.58 sq yards 18.00 sq mtrs

Within the above said boundaries for an extent of 118 sq yards of site with all water ways, path ways, easement rights, corporeal rights and incorporeal rights etc.

Ramachandrapuram
04-01-2025

Tantravahi Subba Rao BSC,BL
R.V.G.SUBBA RAO BSC,BL Advocates.
D.No. 13-7-4, Thyagaraja Nagar
RAMACHANDRAPURAM-533 255.Phone : 99480 10300